# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

రంగారెడ్డి | సంపుటి : 02 | సంచిక: 126 | పేజీలు: 4 | వెల: 4/- | ఆదివారం 01, డిసెంబర్ 2024 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి


## మహా సస్పెన్స్ కంటిన్యూ..

- మహారాష్ట్ర సీఎం రేసులోకి మురళీధర్ మోహెూల్?
- సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం



**ముంబై, నవంబర్ 30 (నమస్తే ఉదయం):** మహా సస్పెన్స్ కంటిన్యూ అవుతోంది. దేవేంద్ర ఫడ్నవీస్ లేదా ఏక్‌నాథ్ షిండేనా.. సీఎం ఎవరన్నది తేలిపోయే క్రమంలో మహాయుతి మీటింగ్ రద్దవ్వడం షిండే స్వగ్రామానికి వెళ్లిపోవడం హాట్‌టాపిక్‌గా మారింది. ఈ క్రమంలో మహారాష్ట్ర సీఎం ఇంకా ఎవరో తేలలేదు..

మిగతా.. 2లో

# రుణమాఫీపై చర్చకు కేసీఆర్, మోడీ సిద్ధమా?

- ఏడాదిలోనే 25 లక్షల రైతుల కుటుంబాలకు రుణమాఫీ
- రుణమాఫీపై చర్చకు కేసీఆర్, మోడీ సిద్ధమా?
- బోనస్ పైసలు పడుతుంటే వాళ్ల గుండెలు అదురుతున్నాయ్
- రైతులు సంతోషంగా ఉంటే బీఆర్ఎస్ నేతలకు నిద్ర పట్టడం లేదు
- ఇంత పెద్ద ఎత్తున రుణమాఫీ చేసిన చరిత్ర ఎక్కడైనా ఉందా?
- మహబూబ్‌నగర్ రైతు పండుగ సభలో సీఎం రేవంత్ రెడ్డి





**మహబూబ్‌నగర్,నవంబర్30(నమస్తే ఉదయం):** గత ప్రభుత్వం వడ్డీతో సహా రూ.లక్ష రుణమాఫీ చేస్తామని చెప్పి రైతులను మోసం చేసింది. కానీ, మా ప్రభుత్వం ఏడాదిలోనే 25 లక్షల రైతు కుటుంబాలకు రూ.21వేల కోట్ల రుణమాఫీ చేసింది. దేశంలో మరే రాష్ట్రం ఇంత రుణమాఫీ చేయలేదని చెప్పడం గర్వంగా ఉంది," అని వివరించారు. "రైతులకు ఉచిత కరెంట్ ఇచ్చింది కాంగ్రెస్ పార్టీనే. ఇది దేశంలో మా ప్రత్యేకత," అని గుర్తు చేశారు. "ప్రధాని మోదీ, కేసీఆర్ ఎవరైనా ఈ స్థాయిలో రైతులకు చేయగలరా?" అని సవాల్ విసిరారు. రైతుల కోసం తమ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు దేశానికి ఆదర్శంగా ఉంటాయని రేవంత్ రెడ్డి అన్నారు. "రైతు పండుగ అంటే కేవలం ఓ కార్యక్రమం కాదు, ఇది ప్రజా ప్రభుత్వ సంకల్పాన్ని చూపిస్తుంది," సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి రైతులకు భారీ శుభవార్త చెప్పారు. రైతుల అకౌంట్లో మరోసారి డబ్బులు జమ చేశారు. రైతుల కోసం నిజంగా కృషి చేసింది కాంగ్రెస్ ప్రభుత్వాలేనని రేవంత్ రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన రైతు పండుగ సభలో మాట్లాడిన రేవంత్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. రైతుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం ఇప్పటివరకు రూ.54 వేల కోట్లు ఖర్చు చేసిందని వెల్లడించారు. బోనస్ పైసలు పడు తుంటే బీఆర్ఎస్ వాళ్ల గుండెలు అదురు తున్నా యని పాలమూరు గడ్డ రైతుల వేదికగా అన్నారు. ప్రజాప్రభుత్వం 54వేల కోట్లు రైతుల కోసం ఖర్చు పెట్టిందని అన్నారు. రైతుపండగకు ఏర్పాట్లు చేసిన అధికారులకు అభినందనలు తెలియజేశారు. నవంబర్ 30కి దేశవ్యాప్తంగా ప్రాధాన్యత ఉందని చెప్పారు. 2023 నవంబర్ 30న రాష్ట్రంలో మార్పు కోరుకుంటూ దొరల గడీలను కూల్చడానికి ప్రజలు కాంగ్రెస్‌కు ఓటు వేశారన్నారు. పాలమూరు బిడ్డగా రైతుల కష్టాలు ఎన్నో చూశానని, వలసలు పోతున్న బస్సులను చూసి ఆవేదన వ్యక్తం చేశానని చెప్పారు. వనపర్తిలో చదువుకుంటున్నప్పుడే ఏదో ఒకరోజు పాలమూరు బిడ్డకు అవకాశం వస్తుందని అనుకున్నట్టు చెప్పారు బూర్గుల రామకృష్ణారావు తరవాత సరిగ్గా 70 సంవత్సరాల తరవాత మీ బిడ్డ కొండారెడ్డిపల్లి నుండి బయలుదేరి తెలంగాణ సీఎం అయ్యాడని అన్నారు. అనవసరమైన ఖర్చులు పెట్టడానికి ఈ అవకాశం రాలేదని అన్నారు. భట్టి విక్రమార్క సహా పార్టీలోని సీనియర్ నాయకులు పాలమూరు జిల్లా బిడ్డకు అవకాశం ఇవ్వాలని తనకు అవకాశం ఇచ్చారని అన్నారు. వాళ్లందరికీ పాలమూరు బిడ్డలు రుణపడి ఉంటారని చెప్పారు. కేసీఆర్ కుటుంబ సభ్యులు ఏం చేశారో నా కంటే మీకే ఎక్కువ తెలుసు అని అన్నారు. కేసీఆర్ అప్పుడు వరి వేసుకుంటే ఉరే అని అన్నాడని విమర్శించారు. కానీ తాము వరి వేసుకుంటే రూ.500 బోనస్ ఇస్తున్నామని, ఆ పైసలు రైతుల ఖాతాల్లో పడుతుంటే బీఆర్ఎస్ నాయకుల గుండెలు అదురుతున్నాయని సీఎం సంచలన వ్యాఖ్యలు చేశారు. రైతులు సంతోషంగా ఉంటే బీఆర్ఎస్ నేతలకు నిద్రపట్టడం లేదన్నారు. స్వతంత్ర భారతదేశంలో ఇంత పెద్ద ఎత్తున రుణమాఫీ చేసిన చరిత్ర ఉందా? అని ప్రశ్నించారు. రుణమాఫీపై చర్చకు కేసీఆర్, మోడీ సిద్ధమా? ఏడాదిలోనే 25 లక్షల రైతుల కుటుంబాలకు 21 వేల కోట్ల రుణమాఫీ చేసిన రాష్ట్రం ఉందా? రైతు రుణమాఫీ చేసిన చరిత్ర తమదేనని స్పష్టం చేశారు. కాళేశ్వరం కట్టిన అన్నడు, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల చేపట్టిన అన్నాడు.

మిగతా.. 2లో

## పులి సంచారంతో వణికిపోతున్న ప్రజలు

- ఆసిఫాబాద్ జిల్లాలో 144 సెక్షన్

**ఆసిఫాబాద్, నవంబర్ 30 (నమస్తే ఉదయం):** ఆసిఫాబాద్ జిల్లాలో పులి సంచారం గడగడలాడిస్తోంది. గత కొన్ని రోజులుగా పశువుల మందలపై దాడులు చేస్తున్న పులి.. శుక్రవారం ఉదయం ఓ యువతిని చంపేసింది. కాగజ్‌నగర్ మండలం గన్నారంలో ఉదయం 8.30 గంటల సమయంలో పత్తి ఏరుతున్న మోర్లె లక్ష్మిపై దాడి చేసింది. దీంతో ఆమె తీవ్రంగా గాయపడి మృతిచెందింది. ఈ నేపథ్యంలో అటవీ శాఖ అధికారులు అలర్ట్ అయ్యారు. దాడి జరిగిన ప్రాంతానికి దగ్గరలోనే పులి సంచరిస్తున్నట్లు నిర్ధరించారు. ఈ నేపథ్యంలో కాగజ్‌నగర్ మండలంలోని పలు గ్రామాల్లో



మిగతా.. 2లో

## టీజీఎస్సీ చైర్మన్‌గా బుర్రా వెంకటేశం


**హైదరాబాద్,నవంబర్ 30 (నమస్తే ఉదయం):** తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్‌గా సీనియర్ ఐఏఎస్ అధికారి బుర్రా వెంకటేశం నియమితులయ్యారు. ఈ మేరకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆమోదముద్ర వేశారు. ప్రస్తుతం టీజీపీఎస్సీ చైర్మన్‌గా ఎం. మహేందర్ రెడ్డి కొనసాగుతున్నారు. ఆయన పదవీకాలం డిసెంబర్ 3న ముగియనుంది. దీంతో కొత్త చైర్మన్ నియామకానికి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నెల 20 వరకు దరఖాస్తులు స్వీకరించింది. మొత్తం 45 అప్లికేషన్లు రాగా అందులో రిటైర్డ్ ఐఏఎస్‌లు, వివిధ వర్సిటీలకు చెందిన ప్రొఫసర్లు కూడా ఉన్నారు. వారిలో బుర్రా వెంకటేశంను ఎంపిక చేసిన ప్రభుత్వం.. నియామక ఆమోదం కోసం ఫైలును రాజ్‌భవన్‌కు పంపించింది. దీంతో శనివారం ఉదయం ఆ ఫైలుపై గవర్నర్ సంతకం చేశారు. దీంతో మరో నాలుగేండ్ల సర్వీస్ ఉన్నప్పటికీ.. ముందుగానే స్వచ్ఛంద పదవీ విరమణ చేయనున్నారు. డిసెంబర్ 2న టీజీపీఎస్సీ చైర్మన్‌గా బాధ్యతలు తీసుకోనున్నారు. 2030 వరకు ఆ



మిగతా.. 2లో

## అంతరిక్ష రంగంలోనూ స్టార్టప్‌లదే జోరు

- భారత్ గణనీయమైన పురోగతి
- 431 విదేశీ ఉపగ్రహాలను ప్రయోగించాం
- ఇస్రో చైర్మన్ ఎస్ సోమనాథ్ వెల్లడి



**న్యూఢిల్లీ,నవంబర్ 30 (నమస్తే ఉదయం):** భారతదేశంలో అంతరిక్ష కార్యకలాపాలను ప్రోత్సహించడంలో ప్రైవేట్ రంగం, స్టార్టప్‌లు

మిగతా.. 2లో

## తమిళనాడును వణికిస్తోన్న ఫెంగల్ తుఫాన్

- కుండపోత వర్షాలతో ఉక్కిరిబిక్కిరి
- భారీ వర్షాలతో చెన్నై అతలాకుతలం
- 9 జిల్లాలలో పాఠశాలలు, కళాశాలలకు సెలవు
- 9 జిల్లాల్లో రెడ్ అలర్ట్ ప్రకటన



**చెన్నై, నవంబర్ 30(నమస్తే ఉదయం):** ఫెంగల్ తుఫాన్ తమిళనాడును వణికిస్తోంది. తీరం దాటక ముందే

మిగతా.. 2లో

## ప్రాణాంతక వైరస్‌లు స్వైరవిహారం

- హైదరాబాద్‌లో కలకలం రేపుతోన్న మరో వైరస్
- చలి తీవ్రతతో విస్తరిస్తున్న వైరస్
- రోజుకు 100పైగా కేసులు నమోదు
- న్యూమోనియా బారిన పడుతున్న చిన్నారులు

**హైదరాబాద్, నవంబర్ 30 (నమస్తే ఉదయం):** గత కొన్ని రోజులుగా రెండు తెలంగాణలో భారీగా ఉష్ణోగ్రతలు తగ్గుతున్నాయి. రాత్రి ఉష్ణోగ్రతలు భారీగా పడిపోతున్నాయి. దీంతో చలి గాలుల ప్రభావం చిన్న పిల్లల ఆరోగ్యంలో తీవ్ర సమస్యలు కలిగిస్తోంది. రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గడంతో, చిన్నారులు న్యూమోనియా బారిన పడుతున్నారు. ముఖ్యంగా హైదరాబాద్ నిలోఫర్ ఆసుపత్రిలో రోజూ పదుల సంఖ్యలో చిన్నపిల్లలు చేరుతున్నారు. తెలంగాణలో చలి తీవ్రత విపరీతంగా పెరిగింది. కొన్ని ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 8 డిగ్రీల కంటే తక్కువగా నమోదవుతున్నాయి. చల్లని గాలుల కారణంగా చిన్నారులు, వృద్ధులు ఎక్కువగా అనారోగ్యం బారిన పడుతున్నారు. వైద్యులు వెల్లడించిన వివరాల మేరకు.. ఇప్పటి వరకు 200కి పైగా న్యూమోనియా కేసులు నమోదవు తున్నాయన్నారు. రోజూ ఓపీ



మిగతా.. 2లో

## డీప్ ఫేక్‌ను అడ్డుకోవాల్సిందే..

- డీప్ ఫేక్ ల వల్ల విపరిణామాలు
- ఏఐ టెక్నాలజీని చెడు కోసం వినియోగిస్తున్నారు
- సెలెబ్రిటీల పరువు తీయడానికి వాడుకుంటున్నారు
- కొందరిని లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియాలో దాడులు
- మతాల మధ్య చిచ్చు పెట్టడానికి డీప్ ఫేక్‌ల ఉపయోగం
- ఫ్యాక్ట్ చెక్ ట్రైనర్ ఉడుముల సుధాకర్ రెడ్డి
- డేటా సైన్స్ సమిట్‌లో కీలక అంశాలు



**హైదరాబాద్, నవంబర్ 30 (నమస్తే ఉదయం):** మారిన టెక్నాలజీతో పాటు మోసాలు కూడా అదే స్థాయిలో పెరుగుతున్నాయి. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను ఉపయోగించుకొని డీప్ ఫేక్ వీడియోలను రూపొందిస్తూ కొందరు ఫేక్ వీడియోలను తయారు చేస్తున్నాయి. అయితే ఇలాంటి వీడియోలను అడ్డుకునే అవసరం వచ్చిందని ప్రముఖ పాత్రికేయుడు, ఫ్యాక్ట్ చెక్ ట్రైనర్ ఉడుముల సుధాకర్ రెడ్డి చెప్పుకొచ్చారు.ప్ ఫేక్‌ల వల్ల

మిగతా.. 2లో

## కుంభమేళాకు ప్రత్యేక రైళ్లు

- జనవరి 13 నుంచి మహా కుంభమేళా
- 1,225 ప్రత్యేక రైళ్లను నడుపనున్నట్లు రైల్వే శాఖ వెల్లడి



**ప్రయాగ్‌రాజ్, నవంబర్ 30 (నమస్తే ఉదయం):** ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో వచ్చే ఏడాది జరగనున్న మహాకుంభమేళాకు ఏర్పాట్లు చేస్తున్నారు. దేశ విదేశాల నుంచి భక్తులు, సాధువులు సహా దాదాపు 40 కోట్ల మంది యాత్రికులు వస్తారని అంచనా వేస్తున్నట్లు రైల్వే శాఖ తెలిపింది. వచ్చే ఏడాది జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26 వరకు మహా కుంభమేళాను నిర్వహించనున్నారు. ఈ జాతర కోసం ప్రత్యేక రైళ్ళను నడుపుతున్నట్లు రైల్వే శాఖ అధికారులు వెల్లడించారు. ప్రయాగ్ రాజ్ కు 140 సాధారణ రైళ్లు నడుస్తూ ఉంటాయి. అయితే ఈ మహా కుంభ మేళా సమయంలో.. ఆరు ప్రధాన పండగల సమయంలో రైల్వే శాఖ 1,225 ప్రత్యేక రైళ్లను నడుపనున్నట్లు వెల్లడించింది. ప్రయాగ్ రాజ్ లో స్నానం చేసి అనంతరం అయోధ్య, కాశీని సందర్శించాలనుకునే యాత్రికుల కోసం ప్రయాగ్‌రాజ్, ప్రయాగ్, అయోధ్య, వారణాసి, రాంబాగ్ మొదలైన ప్రధాన స్టేషన్‌లలో ఈ రైళ్ళు ఆగే విధంగా తమ సేవలను ప్రయాణీకుల సౌకర్యం కోసం అందించే విధంగా రైల్వే సిబ్బంది ఆలోచిస్తుందని రైల్వే ప్రతినిధి తెలిపారు. చిత్రకూట్ సందర్శించాలనుకునే యాత్రికుల కోసం, ఝూన్సీ, బందా, చిత్రకూట్, మాణిక్‌పూర్, ప్రయాగ్‌రాజ్, ఫతేపూర్, గోవింద్‌పురి, ఒరాయ్‌లను కవర్ చేసే మరో రింగ్ రైలు సర్వీస్ ప్లాన్ చేసినట్లు వెల్లడించారు. ఈ 1,225 ప్రత్యేక రైళ్లలో.. 825 తక్కువ మార్గాల్లో నడప నుండగా.. 400 స్పెషల్ ట్రైన్స్ దూర ప్రాంతాల కోసం రిజర్వ్ చేసినట్లు తెలిపారు. ఇప్పుడు నడప నున్న రైళ్ళ సంఖ్య 2019 సమయంలో నడిచిన రైళ్ల కంటే దాదాపు 177 శాతం ఎక్కువ అని చెప్పారు. అప్పుడు 533రైళ్ళు తక్కువ దూరంలో నడపగా.. 161 దూరంలో ప్రయాణించే రైళ్ళు నడిపిమ్చినట్లు రైల్వే ప్రతినిధి తెలిపారు.

## తెలంగాణలో చివరి దశకు సమగ్ర కుటుంబ సర్వే

ఇళ్లకు తిరిగి వివరాలు సేకరిస్తున్న ఎన్యుమరేటర్లు ◆ వివరాలను రహస్యంగా ఉంచుతున్న అధికారులు

**హైదరాబాద్, నవంబర్ 30 (నమస్తే ఉదయం):** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, ఉపాధి, విద్య, ఆర్థిక, రాజకీయ, కులగణన తుది దశకు చేరుకుంది. ఏ రోజుకు ఆ రోజు ఎన్యుమరేటర్లు ఇళ్లకు తిరిగి వివరాలు సేకరిస్తున్నారు. అనంతరం వాటిని ఆన్‌లైన్లో పొందుపరుస్తున్నారు. అలాగే ఇళ్లలో లేని వారికి ఫోన్ చేసి మరీ వివరాలు సేకరిస్తున్నారు. తెలంగాణ



మిగతా.. 2లో

## ఏసీబీకి చిక్కిన అవినీతి తిమింగలం



- ఏఈఈ నిఖేష్ కుమార్ అక్రమాస్తులు రూ.150 కోట్లకు పైనే

**హైదరాబాద్, నవంబర్ 30 (నమస్తే ఉదయం):** తెలంగాణ ఏసీబీ వలకు భారీ అవినీతి తిమింగలం చిక్కింది. నీటిపారుదల శాఖ ఏఈఈ నిఖేశ్ కుమార్ నివాసంలో ఏసీబీ ఏకకాలంలో

మిగతా.. 2లో

## 317 జీవోపై ప్రభుత్వం కీలక నిర్ణయం

**హైదరాబాద్, నవంబర్ 30 (నమస్తే ఉదయం):** తెలంగాణలో జీవో 317 కారణంగా నష్టపోయిన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు రేవంత్ సర్కారు త్వరలోనే శుభవార్త చెప్పే అవకాశం ఉంది. ఈ జీవో అమలుతో ఇబ్బందులకు గురైన భార్యాభర్తలు, మ్యూచవల్, అనారోగ్య కారణాలున్న ఉద్యోగుల బదిలీలకు సంబంధించిన ఫైలుపై సీఎం రేవంత్ సంతకం చేసినట్టు సమాచారం. 317 జీవోపై ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించింది. ఆ సబ్ కమిటీ మ్యూచవల్, హెల్త్ గ్రౌండ్, స్పౌజ్ ట్రాన్స్‌ఫర్లు జరపాలని కొన్ని రోజుల కిందట ప్రాథమికంగా నిర్ణయించింది. దీనికి సంబంధించిన ఫైలును సీఎం రేవంత్ రెడ్డికి పంపగా.. శుక్రవారమే దాన్ని ఆమోదించినట్టు తెలుస్తోంది. అతి త్వరలోనే దీనిపై ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉంది. వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధ్యక్షతన ఇటీవల సచివాలయంలో ఉపసంఘం సమావేశమైంది. స్థానికత ప్రకారం ఉద్యోగుల కేటాయింపుపై సుదీర్ఘంగా చర్చించింది. న్యాయ వివాదాలకు తావు లేకుండా కేటాయింపు జరగాలని అభిప్రాయపడింది. స్థానికతకు అవరోధంగా ఉన్న క్లాజ్‌లపై మంత్రులు రాజనర్సింహ, శ్రీధర్‌బాబు 3 గంటలకుపైగా న్యాయ నిపుణులతో చర్చించారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల అభిప్రాయాలను వినతుల రూపంలో ప్రత్యక్షంగా, వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులను కేబినెట్ సబ్ కమిటీ స్వీకరించింది. సమస్యల పరిష్కారానికి కేబినెట్ సబ్ కమిటీ వివిధ శాఖల ఉన్నతాధికారులతో పలు

మిగతా.. 2లో

## 317 జీవోపై ప్రభుత్వం కీలక నిర్ణయం

**మొదటిపేజీ తరువాయి..**

దఫాలుగా సమీక్షలు నిర్వహించింది. తుది నివేదిక పత్రాలను రూపొందించింది. ఈ నివేదిక పత్రాలను సీల్డ్ కవర్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రి దామోదర రాజనర్సింహా ఇటీవల అందజేశారు. అంతకుముందు పలు దఫాలుగా సబ్ కమిటీ భేటీ అయ్యింది. ఆయా సందర్భంగా.. 317 జీవో కారణంగా నష్టపోయిన వారి వివరాలు మాత్రమే గుర్తించి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించింది. దీంతో వివిధ శాఖల నుంచి వివరాలు అందాయి. అన్నింటినీ పరిశీలించి, ఉప సంఘం నివేదికను తయారు చేసింది. దాన్నే ముఖ్యమంత్రికి సమర్పించింది. అయితే.. సబ్ కమిటీ నివేదికను బయటపెట్టాలని ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

## ఏసీబీకి చిక్కిన అవినీతి తిమింగలం

**మొదటిపేజీ తరువాయి..**

సోదాలు చేపట్టింది. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో శనివారం ఉదయం 6 గంటల నుంచి ఏసీబీ అధికారులు సోదాలు చేస్తున్నారు. నిఖేష్ ఇంటితో పాటు బంధువుల నివాసాలలో 25 నుంచి 30 చోట్ల సోదాలు జరుగుతున్నాయి. ఏసీబీ ప్రాథమిక సమాచారం ప్రకారం నిఖేష్ కుమార్ ఆస్తుల విలువ రూ.150 కోట్లు ఉంటుందని అంచనా వేస్తున్నారు. అక్రమాస్తుల కేసులో ఏఈఈ నిఖేష్ కుమార్ కు చెందిన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని 25 ప్రదేశాలలో ఏసీబీ దాడులు చేసింది. తనిఖీలు ఇంకా కొనసాగుతున్నాయి. నిఖేశ్ కుమార్ గతంలో లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఈ కేసులో మే నెలలో జైలు పాలయ్యారు. ఈ కేసు విచారణలో ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నట్లు గుర్తించిన ఏసీబీ దాడులు చేపట్టింది. ఏసీబీ వెలికితీసిన ఆస్తులలో ముఖ్యంగా రియల్ ఎస్టేట్ ఆస్తులు ఉన్నట్లు తెలుస్తోంది. నిఖేశ్ కుమార్‌ను ఈ ఏడాది మేలో ఒక ప్రత్యేక కేసులో ఏసీబీ అరెస్టు చేసింది. రంగారెడ్డి జిల్లా మణికొండలో బొమ్ము ఉపేంద్రనాథ్ రెడ్డి అనే ఫిర్యాదుదారుడి నుంచి ఏఈఈ నిఖేష్ కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె. భన్సీ లాల్, అసిస్టెంట్ ఇంజినీర్ కె. కార్తీక్ , సర్వేయర్ పి. గణేష్ సర్వేయర్ తో కలిసి రూ. 1,00,000 లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. మణికొండలోని నెక్నాంపూర్‌లో ఓ నిర్మాణ ప్రాజెక్టు కోసం ఎన్‌వోసీ ఇచ్చేందుకు, ఫార్వార్డ్ చేయడానికి అధికారులు రూ. 2,50,000 లంచం డిమాండ్ చేశారు. ఇందులో అప్పటికే రూ.1,50,000 అడ్వాన్స్‌గా చెల్లించగా, మిగిలిన రూ.1,00,000 అందజేస్తున్న సమయంలో ఏసీబీ దాడి చేసింది. సర్వేయర్ గణేష్ సర్వే చేయడానికి రూ. 40,000 డిమాండ్ చేసి లంచం తీసుకున్నాడు. ఈ కేసులో దర్యాప్తు చేపట్టిన ఏసీబీ...నిఖేష్ కుమార్ ఆస్తులపై ఆరా తీసింది. నిఖేష్ కుమార్ నివాసం, అతడి సన్నిహితుల ఇళ్లపై నిఘా పెట్టి శనివారం ఉదయం 6 గంటల నుంచి హైదరాబాద్ తో పాటు తెలుగు రాష్ట్రాలలోని 30 వరకు చోట్ల ఏసీబీ సోదాలు చేపట్టింది. ఏసీబీ సోదాల్లో భారీగా వ్యవసాయ భూములు, భవనాలు, భారీగా బంగారం, ఫామ్ హౌస్ ఇతర ఆస్తులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అక్రమాస్తులకు సంబంధించిన డాక్యుమెంట్స్, ఎలక్ట్రానిక్ పరికరాలను సీజ్ చేశారు. ఏసీబీ గుర్తించిన అక్రమాస్తుల విలువ రూ.100 -రూ.150 కోట్లు, అంతకంటే ఎక్కువ ఉండే అవకాశం ఉందని ఏసీబీ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. గండిపేట బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్‌లో నిబంధనలకు విరుద్ధంగా నిఖేష్ కుమార్ అనుమతులు ఇచ్చినట్టు ఏసీబీ అధికారులు గుర్తించారు. గండిపేట, హిమాయత్ సాగర్, నార్సింగి, రాజేంద్రనగర్, మణికొండ పరిధిలో నిఖేష్ భారీగా అక్రమాలకు పాల్పడినట్లు గుర్తించారు. ఆయన పేరిట మూడు ఇళ్లు, రూ.80 కోట్ల ఫామ్ హౌస్‌లు ఉన్నట్లు అధికారులు అంచనా వేశారు. రూ.లక్ష లంచం తీసుకుంటూ పట్టుబడిన నిఖేష్ ప్రస్తుతం సస్పెన్షన్‌లో ఉన్నారు. ఈ కేసులో సస్పెండ్ అయిన నిఖేష్ ప్రస్తుతం ఇంటి వద్దే ఉన్నా... ఆయనపై వరుసగా ఫిర్యాదులు రావడంతో ఏసీబీ దాడులు చేపట్టింది.

## తెలంగాణలో చివరి దశకు సమగ్ర కుటుంబ సర్వే

**మొదటిపేజీ తరువాయి..**

ప్రభుత్వం నిబంధన ప్రకారం సర్వే చేస్తున్నారు. గ్రామాల్లో ఉండి నగరంలో సెటిల్ అయిన వారు సైతం ఇక్కడే తమ వివరాలను ఇస్తున్నారు. అందుకు సంబంధించిన ధ్రువ పత్రాలను అందిస్తున్నారు. మ్మడి మెదక్ జిల్లాలో ఐదు పట్టణాలు, 26 గ్రామీణ మండలాలు ఉన్నాయి. ఈ కుటుంబాల వివరాలను సర్వే చేసేందుకు బ్లాకులుగా విభజించారు. ఒక్కో ఎన్యుమరేటర్‌కు 150 నుంచి 175 వరకు కుటుంబాలను కేటాయించి వివరాలు సేకరించే పనిని ఇచ్చారు. కేటాయించిన ప్రకారం ఎన్యుమరేటర్లు వివరాల సేకరించారు. నవంబర్? 6న సర్వే ప్రారంభం కాగా 8వ తేదీ వరకు కుటుంబాలను గుర్తించి గృహాలకు స్టిక్కర్లు అంటించారు. అనంతరం ఇంటింటి సర్వే చేపట్టారు. ఓ వైపు సర్వే కొనసాగుతుండగానే మరో వైపు సేకరించిన సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో డేటా ఎంట్రీ చేసే పనిని ఆపరేటర్లు మొదలు పెట్టారు.ప్యూటర్లు ఎక్కువగా ఉన్న ఇతర కార్యాలయాలు, పాఠశాలల్లోనూ సర్వే డేటా నమోదు ప్రక్రియ చేస్తున్నారు. డేటా ఎంట్రీలో ఎలాంటి తప్పులు దొర్లకుండా జాగ్రత్తగా నమోదు చేయాలని అధికారులు సూచనలు చేస్తున్నారు. ఎంపీడీవోలు, తహసీల్దార్లతో పాటు ఇతర అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నారు. సర్వే వివరాలు బయటకు వెళ్లకుండా పకడ్బందీ చర్యలు చేపట్టారు. వివరాలు బయటకి వెళ్లకుండా రహస్యంగా ఉంచుతున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో సమగ్ర కుటుంబ సర్వేకు సంబంధించిన వివరాల నమోదు 70% పైగా పూర్తి అయింది. మరో 3 రోజుల్లో సర్వే ఎంట్రీ పూర్తి చేయనున్నారు.

## ప్రాణాంతక వైరస్‌లు స్వైరవిహారం

**మొదటిపేజీ తరువాయి..**

విభాగంలో 30-40 మంది పిల్లలు వస్తున్నారు. సోమ, మంగళ, బుధ వారాల్లో ఈ సంఖ్య 60కి పెరుగుతోంది. వీరిలో కొంతమందికి హెచ్‌ఎఫ్‌ఎన్‌సీ ), వెంటిలేటర్ చికిత్స అవసరమవుతోందని తెలిపారు. ఇదే పరిస్థితి కొనసాగితే రానున్న రోజుల్లో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని వైద్యులు వెల్లడించారు. న్యూమోనియా ప్రధానంగా బ్యాక్టీరియా, వైరస్‌లు, శిలీంధ్రాల ద్వారా వస్తుందని వైద్యులు పేర్కొన్నారు. రెస్పిరేటరీ సిన్సిటియర్ వైరస్, స్ట్రెప్టోకోకస్, ఇన్‌ఫ్లూయింజా వైరస్ వంటి సంక్రమణల కారణంగా 0-5 ఏళ్ల పిల్లలు, 65 ఏళు పైబడి వృద్ధులు ఎక్కువగా ప్రభావితమవుతున్నారు. 6 నెలల చిన్నారులకు తల్లిపాలు తప్పనిసరిగా ఇవ్వాలి. ఇది న్యూమోనియా వంటి ఇన్‌ఫెక్షన్లను నివారించడంలో కీలకంగా పనిచేస్తుంది. లక్షణాలు: తీవ్ర జ్వరం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, శరీరం నీలం రంగులోకి మారడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి. చలి గాలుల బారిన పడకుండా ఉండేందుకు ఉన్ని దుస్తులు ధరించాలి. వేడి ఆహారం, గోరువెచ్చని నీరు తీసుకోవాలి. చలి కాలంలో చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించి, వైద్యుల సూచనలు పాటించడం కీలకం. తగిన జాగ్రత్తలు తీసుకుంటే, అనారోగ్య సమస్యలను సమర్థవంతంగా నివారించవచ్చు.

## రుణమాఫీపై చర్చకు కేసీఆర్, మోడీ సిద్ధమా?

**మొదటిపేజీ తరువాయి..**

కేవలం సాగునీటి ప్రాజెక్టుల కోసం లక్షా ఎనభైమూడు వేల కోట్లు ఖర్చు పెట్టాడన్నారు. కాళేశ్వరానికే లక్షా రెండువేల కోట్లు ఖర్చు చేశారన్నారు. అన్ని కోట్లు ఖర్చు చేసిన ప్రాజెక్టులు కుప్పకూలిపోయి చుక్కనీరు లిఫ్ట్ చేయకపోయినా కాంగ్రెస్ హయాంలో కట్టిన మంజీర, కోయిలసాగర్, శ్రీరాంసాగర్, ఎల్లంపల్లిలాంటి ప్రాజెక్టుల ద్వారా నీళ్లు ఇచ్చి ఈ సంవత్సరం లేకపోయినా 1 కోటి 53 లక్షల మెట్రిక్ టన్నుల వరి పండించామని అన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తరవాత ఈ స్థాయిలో ఎవరూ పండించలేదని చెప్పారు. పాలమూరును అభివృద్ధి చేస్తుంటే కేసీఆర్ కుటుంబం అడ్డుపడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాజెక్టులు కట్టాలన్నా, కంపెనీలు తీసుకురావాలన్నా వాళ్లు అడ్డుపడుతున్నారని ఆరోపించారు. లగచర్లలో చిచ్చు పెట్టింది వాళ్లే అని చెప్పారు. బీఆర్ఎస్ నాయకుల మాటలు నమ్మవద్దని లగచర్ల రైతులకు సూచించారు. నమ్మితే నష్టపోయేది మనమే అని చెప్పారు. కుట్రలను కుతంత్రాలను తిప్పికొట్టాలని అన్నారు. అధికారుల మీద దాడులు చేయాల్సి వస్తే శ్రీశైలం, సాగర్ కట్టేవాళ్లా? అని ప్రశ్నించారు. విపక్షాల ఉచ్చులో పడొద్దని, కుటుంబాలు నాశనం చేసుకోవద్దని సూచించారు. కేసీఆర్, కేటీఆర్ పరిశ్రమలు అడ్డుకుని ఫాంహౌస్‌కు పోతారని, రైతు కష్టం నాకు తెలియదా? అని ఎమోషనల్ అయ్యారు. కొడంగల్‌లో పారిశ్రామిక పార్కులు నిర్మించి ఉద్యోగాలు తేవాలని అనుకున్నానని కానీ, లగచర్లలో గొడవ చేసి మంట పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ మాయమాటలు నమ్మి గిరిజనులు జైళ్లకు పోయే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ ఉన్నప్పుడు మన జిల్లాలకు ఇంతమంది మంత్రులు ఎప్పుడైనా వచ్చారా అని ప్రశ్నించారు. కేసీఆర్ ను ఎప్పుడైనా అన్నా అని పిలిచారా.. ఆయన ఎక్కడ ఉన్నాడో ఎవ్వరికీ తెలియదని అన్నారు. లగచర్ల రైతులకు కావాలంటే ఎకరానికి రూ.20లక్షలు కూడా ఇస్తామని కంపెనీలు వస్తే ఉపాధి వస్తుందని చెప్పారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి పాలమూరు అల్లుడని, మన ఆడబిడ్డనే ఆయన పెళ్లి చేసుకున్నారని అన్నారు. మహబూబ్ నగర్ కు ఏడాదికి రూ. 20 వేల కోట్లు ఇవ్వాలని మంత్రివర్గాన్ని సభా వేదికగా కోరారు. మహబూబ్ నగర్ వలస జీవితాలు బాగుపడాలంటే, ఏడాదికి రూ. 20 వేల కోట్లు ఇవ్వాలని కోరారు. 70 ఏండ్లు తమకు అన్యాయం జరిగిందని చెప్పారు. “నవంబర్ 29కి ఎంతో ప్రత్యేకత ఉంది,” అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. “ఏడాది క్రితం ప్రజలు నిరంకుశ ప్రభుత్వాన్ని గద్దె దించి ప్రజా ప్రభుత్వాన్ని తెచ్చారు. పాలమూరు జిల్లాలో కృష్ణమ్మ నది పారుతున్నా, ఇక్కడి ప్రజల కష్టాలు మాత్రం తీరలేదు. ఉపాధి కోసం ఎన్నో కుటుంబాలు ముంబై, హైదరాబాద్‌లకు వలస వెళ్ళాయి. బూర్గుల రామకృష్ణారావు తర్వాత ఇన్నాళ్లకు పాలమూరు బిడ్డ ముఖ్యమంత్రి అయ్యాడు,” అని అన్నారు. గత ప్రభుత్వాలు రైతుల రుణమాఫీని పూర్తిగా అమలు చేశాయా? అన్న ప్రశ్నను రేవంత్ రెడ్డి లేవనెత్తారు. “వరిని వేస్తే ఉరి వేసుకున్నట్లే” అని గత ముఖ్యమంత్రి చెప్పారని గుర్తు చేస్తూ, ప్రస్తుతం ప్రభుత్వం మాత్రం వరి రైతులకు రూ.500 బోనస్ ఇచ్చి పండుగ తెచ్చిందని చెప్పారు. “గత ప్రభుత్వం రూ.1.02 లక్షల కోట్లతో కాళేశ్వరం ప్రాజెక్ట్ కట్టినా, అది మూడు సంవత్సరాలు కూడా నిలవలేదు. కానీ, ఈ ఏడాది రాష్ట్రంలో 1.50 లక్షల మెట్రిక్ టన్నుల వరి పండించాం,” అని అన్నారు.

# డీప్ ఫేక్‌ను అడ్డుకోవాల్సిందే..

**మొదటిపేజీ తరువాయి..**

విపరిణామాలు చోటు చేసుకుంటున్నాయని, మంచి కోసం ఉపయోగించాల్సిన ఏఐ టెక్నాలజీలను చెడు కోసం వినియోగిస్తున్నారని ప్రముఖ పాత్రికేయుడు, ఫ్యాక్ట్ చెక్ ట్రైనర్ ఉడుముల సుధాకర్ రెడ్డి హైదరాబాద్ లోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ లో డేటా సైన్స్ సమిట్ కార్యక్రమంలో మాట్లాడారు. ఐపీఎస్ అధికారులు, ప్రొఫెసర్లు, ఏఐ నిపుణులు నవంబర్ 29న నిర్వహించిన కార్యక్రమానికి హాజరయ్యారు. ఎన్నికల సమయంలో ప్రత్యర్థులను దెబ్బతీయడం కోసం డీప్ ఫేక్ లను ఉపయోగిస్తూ ఉన్నారని, ఏఐ ద్వారా ముఖాలను మార్చడం, సెలెబ్రిటీల వాయిస్ తో ఇతర వ్యాఖ్యలు చేసేలా ఏఐ ద్వారా సృష్టించడం జరుగుతూ ఉన్నాయన్నారు సుధాకర్ ఉడుముల. సినీ నటుల దగ్గర నుంచి రాజకీయ నాయకులు, ప్రముఖ వ్యాపారులు, ఎవరినైనా సరే ఈ డీప్ ఫేక్‌ల ద్వారా ఫేక్ వార్తలను సృష్టించడం వీలవుతుంది. ఒకప్పుడు డీప్ ఫేక్ లను గుర్తించడం కాస్త సులువుగా ఉండేది.. కానీ అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీ, సాఫ్ట్ వేర్ కారణంగా ఏది డీప్ ఫేక్, ఏది ఒరిజినల్ అని కనుగొనడం కష్టంగా మారిపోతోంది. ఏఐని మంచి కోసం ఉపయోగించకుండా చెడు కోసం ఉపయోగిస్తూ ఉండడమే ఈ పరిణామాలకు కారణమవుతోందన్నారు. సెలెబ్రిటీల పరువు తీయడానికి, కొందరిని లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియాలో దాడులు చేయడానికి, మతాల మధ్య చిచ్చు పెట్టడానికి ఈ డీప్ ఫేక్ లను ఉపయోగిస్తూ ఉన్నారు. డేటా సైన్స్ సమ్మిట్‌ను బ్రిటిష్ డిప్యూటీ కమిషనర్ గారెత్ ఓవెన్ ప్రారంభించారు. కీనోట్ స్పీకర్ గా లారా బాల్డ్విన్, దక్షిణాసియా సైబర్ లీడ్, బ్రిటిష్ హై కమిషన్ వ్యవహరించారు. ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ మదన్ పిల్లుట్ల ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. డీప్ ఫేక్ వీడియోలు సోషల్ మీడియా నుండి మెయిన్ స్ట్రీమ్ మీడియాలోకి వచ్చేయడం కూడా ఆందోళన కలిగిస్తోంది. దీనిపై ప్రముఖ సోషల్‌మీడియా సంస్థలు ఫేస్ బుక్, ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్ కూడా చర్యలకు ఉపక్రమించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సోషల్ మీడియా సైట్స్ ‘ఇన్ బిల్ట్ డీప్ ఫేక్ డిటెక్షన్ అల్గారిథమ్’ ను తీసుకుని వస్తే వీటిని కట్టడి చేయడం సులభం అవుతుంది. సోషల్ మీడియా ద్వారా ఈ డీప్ ఫేక్ వీడియోలు ఎక్కువగా వ్యాపిస్తున్నాయి.

కాబట్టి బాధ్యత తీసుకోవాల్సింది కూడా సోషల్ మీడియా ప్లాట్ ఫామ్‌లదే. ఏఐని రెగ్యులేట్, ఎడ్యుకేట్, డిటెక్ట్ విషయంలో సమిష్టి కృషి అవసరం. భారతదేశంలో తప్పుడు సమాచార వ్యాప్తిని అడ్డుకోవడం కోసం ఫ్యాక్ట్ చెకర్లు మిస్ ఇన్ఫర్మేషన్ కాంబాట్ అలయెన్స్ ను స్థాపించారు. ఇందులో భాగంగా డీప్ ఫేక్ అనాలసిస్ యూనిట్ ను కూడా తీసుకొచ్చారు. ఎవరికైనా డీప్ ఫేక్ మీద అనుమానాలు ఉంటే ఈ యూనిట్ కు వాట్సాప్ ద్వారా సమాచారం అందించవచ్చు. భారత్ లో ఫ్యాక్ట్ చెకింగ్ కు సరైన తోడ్పాటును అందించడం లేదు. మీడియా లిటరసీలో భాగంగా డీప్ ఫేక్ అంటే ఏమిటి, అవి ఎలాంటి ప్రమాదాలకు కారణమవుతాయి లాంటి వివరాలను అందించే కార్యక్రమాలను ప్రభుత్వాలు చొరవ తీసుకుని ఏర్పాటు చేయాల్సిన అవసరం కూడా ఉంది. లావోస్, కంబోడియా లాంటి దేశాల్లో కూర్చొని భారతదేశంలోని పిల్లలు కిడ్నాప్ అయ్యారు, డ్రగ్స్ కేసుల్లో ఇరుక్కున్నారు అంటూ బెదిరింపులకు దిగుతున్నారు. సైబర్ నేరగాళ్లు డీప్ ఫేక్ ఆడియో, వీడియోలను వాడుతూ మోసాలకు తెగబడుతూ ఉన్నారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించడం చాలా ముఖ్యం.

డీప్ ఫేక్ లు ఎన్నో మోసాల్లో భాగమయ్యాయి, మీడియాలోకి చొచ్చుకొస్తున్నాయి. ఎన్నికల ఫలితాలను మార్చే ప్రమాదం కూడా ఉంది. డీప్ ఫేక్ లను వాడి అసభ్యకరమైన వీడియోలను కూడా సృష్టిస్తున్నారు. ఫేషియల్ రికగ్నిషన్ టెక్నాలజీ ద్వారా మన వీడియోలను ఎవరైనా డీప్ ఫేక్ చేశారా అని కూడా తెలుసుకోవాల్సిన దౌర్భాగ్యం మనకు వచ్చింది. ముఖ్యంగా మహిళలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. చాలా అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. డీప్ ఫేకింగ్ రాబోయే రోజుల్లో ఇది మరింత తీవ్రమవుతుంది. ఆర్థికంగా కూడా చాలా ఎంతో మందికి ఇబ్బందులు ఎదురవుతాయి. డీప్ ఫేక్ కారణంగా అటు మంచి, ఇటు చెడు.. రెండూ ఉన్నాయి. రజనీకాంత్ హీరోగా నటించిన వేట్టయాన్ సినిమాలో మలేషియా వాసుదేవన్ పాడినట్లుగా ఏఐ ద్వారా సృష్టించారు. ఇది వాసుదేవన్ కుటుంబం అంగీకారంతో జరిగింది. కానీ అన్ని సందర్భాల్లో ఇలాగే ఉండదు. కొందరు దురుద్దేశపూరితంగా కూడా వ్యవహరించే అవకాశం ఉంది. మంచి ఉద్దేశ్యంతో చేస్తే ఎలాంటి తప్పు లేదని గుర్తుంచుకోవాలి. ఎంటర్టైన్మెంట్ ఇండస్ట్రీలో ఏఐ ద్వారా ఎన్నో సంచలనాలు సృష్టించవచ్చు.ఏఐను ఉపయోగించడంలో ప్రవర్తనా నియమావళి చాలా ముఖ్యం.

ఏఐ మేకర్స్ కూడా ఇన్ బిల్ట్ డిటెక్షన్‌ను తీసుకుని రావాలి. మీడియాకు చెందిన వారికి కూడా వీటిపై సరైన అవగాహన కల్పించాలి. డీప్ ఫేక్ విజువల్స్ ఉండే లోపాలను ప్రతి ఒక్కరూ గుర్తించేలా అవగాహన తీసుకుని రావాలి. హైవ్, హియా వంటి డీప్ ఫేక్ టూల్స్ గురించి తెలియజేయాల్సి ఉంటుంది. సోషల్ మీడియా దిగ్గజాలు, ప్రభుత్వాలు, ఫ్యాక్ట్ చెకర్స్ కలిసి పోరాటం చేస్తేనే డీప్ ఫేక్ తో సమస్యలను అడ్డుకోడానికి వీలవుతుంది.

## తమిళనాడును వణికిస్తోన్న ఫెంగల్ తుఫాన్

**మొదటిపేజీ తరువాయి..**

కుండపోత వర్షాలతో ఉక్కిరిబిక్కిరి చేస్తోంది ఫెంగల్. భారీ వర్షాలతో అతలాకుతలం అవుతుంది చెన్నై. ఈ తుఫానుపై అధికారులతో సీఎం స్టాలిన్ సమీక్ష నిర్వహించారు. తుఫాను కారణంగా సహాయక చర్యలపై సీంఎ అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. చెన్నై సహా ఆరు జిల్లాల్లో తుఫాన్ తీవ్ర ప్రభావం ఎక్కువగా ఉంది. ఈ రాత్రికి చెన్నైలో కుండపోత వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. దీంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి సీఎం స్టాలిన్ సూచించారు. లోతట్టుప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించామని సీఎం తెలిపారు. ఇప్పటికే తమిళనాడులో ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురుస్తోంది.భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. చెంగల్‌పట్టు, మహాబలిపురం, కడలూరులో వర్షం బీభత్సం సృష్టిస్తోంది. తుఫాన్ భయంతో ఫ్లై ఓవర్లపై కార్ల పార్కింగ్, సబ్‌వేలను మూసివేశారు. దీంతో జనజీవనం పూర్తిగా స్తంభించిపోయింది. తుఫాన్ ప్రభావంతో సముద్రంలో అలలు ఎగిసిపడుతున్నాయి. మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని ఐఎండీ హెచ్చరిక జారీ చేసింది. అలాగే చెన్నై విమానాశ్రయం నుంచి విమాన సర్వీసులను సైతం నిలిపివేశారు. ఈ నేపథ్యంలో 9 జిల్లాల పాఠశాలలు, కళాశాలలకు సెలవు ప్రకటించారు. రేపు ఆదివారం సాధారణంగా సెలవు. 9 జిల్లాల్లో రెడ్ అలర్ట్ ప్రకటించిన అక్కడ ప్రభుత్వం.. పరిస్థితి అలాగే ఉంటే సోమవారం కూడా సెలవు ప్రకటించే అవకాశం ఉంది. చెన్నై, తిరువళ్లూరు, కాంచీపురం, చెంగల్‌పట్టు, మైలాడుతురై, కడలూరు, విల్లుపురం, కళ్లకురిచ్చి, రాణిపేటైలో నిరంతర వర్షాల కారణంగా పాఠశాలలు, కళాశాలలకు సెలవు ప్రకటించారు. అలాగే తంజావూరు జిల్లాలో కుంభకోణం, తిరువిడైమరుదూర్ తాలూకాలలో కురుస్తున్న వర్షాల కారణంగా పాఠశాలలకు మాత్రమే సెలవు ప్రకటించారు. అయితే తుఫాను కారణంగా పాఠశాల, కళాశాలలకు మరిన్ని సెలవులు ప్రకటించే అవకాశం కనిపిస్తోంది. దీనిపై ఆ రాష్ట్ర విద్యాశాఖ అధికారులతో చర్చలు జరుపుతోంది. అలాగే చెన్నై విమానాశ్రయం నుంచి వెళ్లే విమాన సర్వీసులను సైతం రద్దు చేశారు. నైరుతి బంగాళా ఖాతంలో తుఫాను “ఫెంజాల్” గత 6 గంటల్లో గంటకు 07 కి.మీ వేగంతో ఉత్తర-వాయువ్య దిశగా కదులుతోంది. ఇది ఉత్తర తమిళనాడు-పుదుచ్చేరి తీరాన్ని కారైకాల్, పుదుచ్చేరి సమీపంలోని మహాబలిపురం మధ్య దాటే అవకాశం ఉందని, నవంబర్ 30 మధ్యాహ్నం సమయంలో గంటకు 70-80 కి.మీ నుండి 90 కి.మీ వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని, దాదాపు పశ్చిమ వాయువ్య దిశలో కదులుతుందని వాతావరణ శాఖ తెలిపింది. తుఫాను తీరం దాటే సమయంలో భారీ వర్షాలు, ఈదురు గాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలందరూ అత్యవసర పనులకు మినహా ఇతర పనుల నిమిత్తం బయటకు వెళ్లకుండా సురక్షితంగా ఇళ్లలోనే ఉండాలని అధికారులు సూచించారు. అలాగే, చెన్నై, తిరువళ్లూరు, చెంగల్‌పట్టు, కాంచీ పురం, విల్లుపురం, కళ్లకురిచ్చి, కడలూరు జిల్లాలు, రాణిపేట్, తిరువణ్ణామలై, వేలూరు, పెరంబలూరు, అరియలూరు, తంజావూరు, తిరువారూర్, మైలాడుతురై, నాగపట్నం జిల్లాలు, హేకరాయ్‌లో కొన్ని చోట్ల భారీ నుండి అతి భారీ వర్షాలు కురుస్తున్నాయి. అలాగే తిరుపత్తూరు, కృష్ణగిరి, ధర్మపురి, సేలం, నామక్కల్, తిరుచిరాపల్లి, కరూర్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

## పులి సంచారంతో వణికిపోతున్న ప్రజలు

**మొదటిపేజీ తరువాయి..**

ఆంక్షలు విధించారు. ఈజ్గామ్, నజ్రూల్ నగర్, సీతానగర్, అనుకోడా, గన్నారం, కడంబా, ఆరెగూడ, బాబునగర్, చింతగూడ గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు. ఆయా గ్రామాల ప్రజలు పంట చేలకు, అటవీ ప్రాంతాలకు వెళ్లకుండా 144 సెక్షన్ విధించారు. దాడి చేసిన చోటుకే పులి మళ్లీ వచ్చే అవకాశం ఉందని, అటువైపు ఎవ్వరూ వెళ్లొద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. జిల్లాలోని అటవీ ప్రాంత గ్రామాల్లో సంచరిస్తున్న పులులు ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నాయి. నిత్యం ఎక్కడో చోట పశువుల మందలపై పంజా విసురుతూ దడ పుట్టిస్తున్నాయి. నాలుగేళ్ల క్రితం దహెగాం మండలం దిగడ గ్రామానికి చెందిన విగ్నేశ్‌ను, పెంచికల్‌పేట్ మండలం కొండపల్లి గ్రామానికి చెందిన పసుల నిర్మలను, గతేడాది వాంకిడి మండ లం ఖానాపూర్‌కు చెందిన రైతు సిడాం భీము ను పొట్టనబెట్టుకోగా, ఆ ఘటనలు మరవకముందే శు క్రవారం ఓ పులి మరో మహిళను బలి తీసుకున్నది. కాగజ్‌నగర్ మండలం గన్నారం గ్రామానికి చెందిన మోర్లె లక్ష్మి (22) .. శుక్రవారం మరో 20 మంది కూలీలతో కలిసి సమీపంలోని చేనులో పత్తి ఏరేందుకు వెళ్లింది. ఉదయం 8.30 గంటల ప్రాంతంలో అందరూ పనిలో నిమగ్నం కాగా.. పెద్ద పులి ఒక్కసారిగా మోర్లె లక్ష్మిపై దాడి చేసింది. కూలీలు కేకలు వేయడంతో అది అక్కడి నుంచి వెళ్లిపోయింది. లక్ష్మిని వెంటనే పట్టణంలోని ప్రైవేట్ దవాఖానకు తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. జిల్లాలో పులుల దాడుల్లో ఇప్పటి వరకు నలుగురు మృతి చెందారు. 2020 నవంబర్ 11న దహెగాం మండలం దిగిడ గ్రామానికి చెందిన విగ్నేష్ చేపల వేటకు వెళ్లగా, పులి దాడి చేయడంతో మృతి చెందాడు. 2020 నవంబర్ 29న పెంచికల్‌పేట్ మండలం కొండపల్లి గ్రామానికి చెందిన పసుల నిర్మల (15) పత్తి ఏరుతుండగా, పెద్ద పులి దాడిచేసి చంపేసింది. అలాగే 2023 నవంబర్ 16న వాంకిడి మండలం ఖానాపూర్‌కు చెందిన రైతు సిడాం భీము తన చేనులో పత్తి ఏరుతుండగా పులి పంజా విసరడంతో మృత్యువాత పడ్డాడు. తాజాగా.. శుక్రవారం గన్నారంలో పత్తి ఏరుతున్న మహిళపై పులి దాడి చేసి చంపడం స్థానికంగా కలకలం రేపుతున్నది.

## టీజీఎస్సీ చైర్మన్‌గా బుర్రా వెంకటేశం

**మొదటిపేజీ తరువాయి..**

పదవిలో కొనసాగనున్నారు. కాగా, 1995 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన బుర్రా వెంకటేశం ఆ ఏడాది యూపీఎస్సీ ఫలితాల్లో జాతీయ స్థాయిలో 15వ ర్యాంకు, ఉమ్మడి ఏపీలో మ్మొదటి ర్యాంకు సాధించాడు. వివిధ జిల్లాలో అడిషనల్ కలెక్టర్‌గా, కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో పేద కుటుంబంలో పుట్టి.. తన ఏడవ ఏటనే తండ్రిని కోల్పోయారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి, ట్యూషన్లు చెబుతూ ఎంతో కష్టపడి సివిల్స్ సాధించారు. 2019లో ‘సెల్ఫీ ఆఫ్ సక్సెస్’ పేరుతో ఆయన ఇంగ్లిష్‌లో ఓ పుస్తకాన్ని రచించారు.

## మహా సస్పెన్స్ కంటిన్యూ..

**మొదటిపేజీ తరువాయి..**

కాని కొత్త ముఖ్యమంత్రి ప్రమాణస్వీకారం తేదీ మాత్రం ఖరారయ్యింది. డిసెంబర్ 5వ తేదీన మహారాష్ట్ర కొత్త కేబినెట్ ప్రమాణం చేస్తుంది. ముంబై ఆజాద్ మైదాన్ వేదికగా ముఖ్యమంత్రితో పాటు కొత్త మంత్రులు ప్రమాణం చేస్తారంటూ ప్రకటన విడుదలైంది.. డిసెంబర్ 3వ తేదీన బీజేపీ శాసనసభా పక్ష సమావేశం జరుగుతుంది. ఈ సమావేశంలో సీఎం ఎంపిక జరుగుతుంది. అయితే ఫడ్నవీస్‌కే సీఎం పదవి దక్కుతుందా ? లేక అనూహ్యంగా కొత్త నేతకు బీజేపీ అవ కాశం ఇస్తుందా ? ఈవిషయంపై క్లారిటీ రావడం లేదు. ఈ తరుణంలో కొత్త పేరు తెరపైకి రావడం, ఆ వ్యక్తి స్వయంగా స్పందించడం హాట్ టాపిక్ గా మారింది. దేవేంద్ర ఫడ్నవీస్‌కు బదులుగా భారతీయ జనతా పార్టీ (బిజెపి) అగ్ర నాయకత్వం మహారాష్ట్ర తదుపరి ముఖ్యమంత్రిగా కేంద్ర పౌర విమానయాన, సహకార శాఖ సహాయ మంత్రి మురళీధర్ మోహోల్‌ను నియమిస్తారని సోషల్ మీడియాలో ఊహాగా నాలు వ్యాపించాయి. దీనిపై వెంటనే.. మురళీధర్ మోహోల్ స్పందించారు.. (ట్విట్టర్)లో పోస్ట్ చేసిన పూణె ఎంపీ ఈ ఊహాగానాలు నిరాధారమైనవి.. కల్పితమంటూ కొట్టిపారే శారు. “సోషల్ మీడియాలో మహారాష్ట్ర ముఖ్యమంత్రి పదవికి నా పేరు ప్రకటనపై ఊహాగానాలు నిరాధారమైనవి.. కల్పితం. బిజెపి నేత, మా నాయకుడు దేవేంద్ర ఫడ్నవిస్ నాయకత్వంలో మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో పోరాడింది. మహారాష్ట్ర ప్రజలు కూడా చారిత్రాత్మకమైన తీర్పును ఇచ్చారు..” అంటూ పేర్కొన్నారు..‘బీజేపీలో సోషల్ మీడియా ఊహాగానాల ద్వారా కాకుండా పార్లమెంటరీ బోర్డు ఏకగ్రీవంగా నిర్ణయాలు తీసుకుంటుంది! ఒకసారి పార్లమెంటరీ బోర్డు నిర్ణయం తీసుకుంటే, పార్టీ నిర్ణయమే మాకు సుప్రీం. అందుకే సోషల్ మీడియాలో నా పేరుపై ఊహాగానాలు అర్థరహితం.” అంటూ మురళీధర్ మోహోల్ క్లారిటీ ఇచ్చారు. కాగా.. ఇటీవల జరిగిన మహారాష్ట్ర ఎన్నికల్లో 288 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మహాయుతి కూటమి 230 స్థానాల్లో భారీ ఆధిక్యం సాధించింది. బీజేపీ 132 సీట్లు గెలుచుకోగా, దాని మిత్ర పక్షాలు ఏక్నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన 57 సీట్లు, అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ 41 సీట్లు గెలుచుకున్నాయి. మహా వికాస్ అఘాడి కూటమి ఘోరమైన పరాజయాన్ని చవిచూసింది.. శివసేన 20 సీట్లు, కాంగ్రెస్ 16, శరద్ పవార్ వర్గం) 10 సీట్లు మాత్రమే గెలుచుకున్నాయి. చారిత్రా త్మకమైన ఫలితాన్ని పొందినప్పటికీ, ఓట్ల లెక్కింపు ముగిసిన ఏడు రోజుల తర్వాత మహాయుతి కూటమి ముఖ్యమంత్రిపై నిర్ణయం తీసుకోలేదు. ఏక్‌నాథ్ షిండేను నియమించేందుకు బీజేపీ విముఖత చూపడంతో ఆయన అసంతృప్తితో ఉన్నారని ఊహాగానాలు వ్యక్తమవు తున్నారు. వినోద్ తావ్డే, రాధాకృష్ణ విఖే-పాటిల్ వంటి ప్రత్యామ్నాయ పేర్లను కూడా పరిశీలిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

# అంతరిక్ష రంగంలోనూ స్టార్టప్‌లదే జోరు

**మొదటిపేజీ తరువాయి..**

కీలక పాత్ర పోషిస్తాయని ఇస్రో చైర్మన్ ఎస్ సోమనాథ్ అన్నారు. వారి సహకారంతో గ్లోబల్ మార్కెట్‌లో దేశం మరింత వాటాను పొందగలదని ఆయన అభిప్రాయపడ్డారు. గ్లోబల్ మార్కెట్‌లో మరింత వాటాను కైవసం చేసుకునేందుకు భారత్ తన అంతరిక్ష కార్యకలాపాలను పెంచుకోవాలని చూస్తోంది. శుక్రవారం(నవంబర్ 29) కేరళ స్టార్టప్ మిషన్ నిర్వహించిన దేశ ఫ్లాగ్‌షిప్ స్టార్టప్ ఫెస్టివల్ హడిల్ గ్లోబల్ 2024లో ‘ఇస్రో విజన్ భారత స్పేస్ టెక్ కంపెనీల పెరుగుదల’ అనే అంశంపై ఆయన కీలక ఉపన్యాసం చేశారు. తిరువనంతపురంలో కేరళ స్టార్టప్ మిషన్ కార్యక్రమం ‘హడిల్ గ్లోబల్ 2024’లో ‘ఇస్రో విజన్ భారతదేశంలో అంతరిక్ష సాంకేతిక సంస్థల పెరుగుదల’పై ఎస్ సోమనాథ్ మాట్లాడుతూ, అంతరిక్ష శక్తిగా గుర్తించబడినప్పటికీ, ప్రపంచ వ్యాపారంలో భారతదేశం వాటా కేవలం రెండు మాత్రమే. శాతం అంటే 386 బిలియన్ %ఖూ% డాలర్లు. 2030 నాటికి 500 బిలియన్ డాలర్లకు, 2047 నాటికి 1,500 బిలియన్ డాలర్లకు పెంచాలని భారత్ యోచిస్తోందన్నారు. ప్రైవేట్ రంగానికి వాణిజ్య కార్యకలాపాలకు ఉన్న అవకాశాలను సూచిస్తూ, భారతదేశంలో కేవలం 15 కార్యాచరణ అంతరిక్ష ఉపగ్రహాలు మాత్రమే ఉన్నాయని, ఇది చాలా తక్కువ అని సోమనాథ్ అన్నారు. అంతరిక్ష సాంకేతికతలో భారత్‌కు ఉన్న నైపుణ్యం, పెరుగుతున్న ఉపగ్రహాల తయారీ కంపెనీల దృష్ట్యా కనీసం 500 ఉపగ్రహాలను అంతరిక్షంలో ఉంచగల సామర్థ్యం మన దేశానికి ఉందని సోమనాథ్ తెలిపారు. “ప్రస్తుత మార్కెట్‌లో అనేక ప్రైవేట్ సంస్థలు అభివృద్ధి చెందుతున్నాయి. ఇవి ఉపగ్రహాలను తయారు చేసి వాటిని కక్ష్యలో ఉంచగల సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి. ప్రైవేట్ ‘లాంచ్‌ప్యాడ్‌లు’ కూడా నిర్మిస్తున్నాయి. 2014లో అంతరిక్ష సంబంధిత స్టార్టప్‌లు ఒక్కటే ఉండగా, 2024 నాటికి ఈ సంఖ్య 250కి పైగా పెరిగింది. 2023లోనే స్పేస్ స్టార్టప్ విభాగంలో రూ.1,000 కోట్ల పెట్టుబడులు వచ్చాయని సోమనాథ్ తెలిపారు. పెద్ద కంపెనీలు ఇప్పుడు అంతరిక్ష రంగానికి చురుకుగా సహకరిస్తున్నాయని సోమనాథ్ KSUM విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.భారతదేశం అంతరిక్షంలో తన కార్యకలాపాలను ఇంటర్-ప్లానెటరీ అన్వేషణకు విస్తరించడంతో, భారతదేశం మానవ అంతరిక్ష యాత్ర కార్యక్రమం గగన్‌యాన్ , భారత అంతరిక్ష కేంద్రం వంటి భవిష్యత్ ప్రాజెక్టులు కూడా ISRO, ప్రైవేట్-



రంగం మధ్య సహకార ప్రయత్నాలుగా ఉంటాయని సోమనాథ్ తెలిపారు. చిన్న ఉపగ్రహాలు, జియోస్పేషియల్ సొల్యూషన్స్, కమ్యూనికేషన్ సిస్టమ్స్, ఆర్బిటల్ ట్రాన్స్‌ఫర్ వెహికల్స్ వంటి మరెన్నో రూపకల్పన, ప్రయోగాలలో ప్రైవేట్ రంగ ప్రమేయానికి అపారమైన అవకాశం ఉందని ఆయన అన్నారు. ఇస్రో ఇప్పటి వరకు 431 విదేశీ ఉపగ్రహాలను ప్రయోగించామని, అంతరిక్ష రంగంలో భారత్ గణనీయమైన పురోగతి సాధించిందని సోమనాథ్ పేర్కొన్నారు.



సమగ్ర కుటుంబ సర్వే వివరాలను అందచేస్తున్న హైదారాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ

## సమగ్ర కుటుంబ సర్వేకు వివరాలు తెలియజేసిన ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ

**రాజేంద్రనగర్, నవంబరు30(నమస్తే ఉదయం):**
హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ నుంచి శనివారం రాజేంద్రనగర్ సర్కిల్ అధికారులు సమగ్ర కుటుంబ సర్వే వివరాలను సేకరించారు. శాస్త్రీపురం కాలనీలోని ఆయన నివాసానికి దక్షిణ మండలం జోనల్ కమిషనర్ టి.వెంకన్న, రాజేం ద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కె.రవి కుమార్. ఎన్యుమరేటర్ మాదవి, సూపర్వైజర్ ఉపేందర్ వెళ్లి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ మాట్లాడుతూ... ప్రతి ఒక్కరు సమగ్ర కుటుంబ సర్వే కు తమ వివరాలు తెలియజేయాలన్నారు. తానే స్వయంగా సమగ్ర కుటుంబ సర్వే ఫారాన్ని నింపి ఇవ్వడం జరిగిందన్నారు.

## రంగారెడ్డి జిల్లా వైజ్ఞానిక ప్రదర్శనలో బుద్వేల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ప్రదమ బహుమతి

**రాజేంద్రనగర్, నవంబరు30( నమస్తే ఉదయం):** శంషాబాద్ లో రెండు రోజుల పాటు నిర్వహించిన రంగారెడ్డి జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో బుద్వేల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కు చెందిన బి.పల్లవి చేసిన నేచురల్ ఫార్మింగ్ (ప్రకృతి



రంగారెడ్డి జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి గెలుచుకున్న బి.పల్లవికి బహుమతి అందచేస్తున్న జిల్లా స్థాయి అధికారులు

వ్యవసాయం) కు జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి లభించింది. ఈ ప్రదర్శన ను తిరిగి రాష్ట్ర స్థాయి లో ప్రదర్శించడానికి అవకాశం దక్కింది. ఈ ప్రదర్శనను చేయడానికి బి.పల్లవికి గైడ్‌గా వ్యవహరించిన జీవ శాస్త్ర ఉపాధ్యాయులు వి.అంజనేయులు, సుజాత లు పల్లవిని అభినందించారు. తమ పాఠశాల కు చెందిన విద్యార్థినీ చేసిన ప్రకృతి వ్యవసాయం నమునా కు జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి వచ్చి రాష్ట్ర స్థాయి. వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపిక కావడం సంతోషంగా ఉందని బుద్వేల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాద్యాయురాలు ఝాన్సీ రాణి సంతోషం వ్యక్తం చేశారు. విద్యార్థినీ పల్లవి తో పాటు పాఠశాల నుంచి వైజ్యానిక ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులను, సహకరించిన ఉపాద్యాయులను, ఎస్ఆర్ఎఫ్ ఫౌండేషన్ కు చెందిన శేఖర్ ను “ఆమె అభినందించారు.

## సిపిఐ నేత బాల మల్లేష్ గుండెపోటుతో మృతి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, నవంబర్ 30(నమస్తే ఉదయం):**



భారత కమ్యూనిస్టు పార్టీ రంగారెడ్డి జిల్లా ఏఐటీయూసీ కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ బాల్ మల్లేష్ గుండెపోటుతో మరణించడం జరిగింది బాల్ మల్లేష్ రంగారెడ్డి జిల్లాలో అనేక ఉద్యమాలు నిర్వ హించి పార్టీని బలోపేతం చేయడం జరిగింది ఆయన మరణం పార్టీకి తీవ్ర నష్టం అని ఆయన లేని నోటు ఎవరు తీర్చలేరు అన్నారు బాలు మల్లేష్ ఆత్మకు శాంతి చేకూరాలని కుటుంబానికి మనోధైర్యం ఇవ్వాలని కోరుతున్నాను

## విద్యార్థులకు పాటి ఫైడ్ బియ్యాన్ని రద్దు చేయాలి

**మధ్యాహ్న భోజన కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి**

**రాజేంద్రనగర్, నవంబరు 30(నమస్తే ఉదయం):**
విద్యార్థులకు పాటి ఫైడ్ బియ్యాన్ని రద్దు చేయాలని మధ్యాహ్న భోజన కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర



నాయకులు వనంపల్లి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ గురుకుల, ప్రైమరీ, జిల్లా పరిషత్, పాఠశాలల్లో బడుగు బలహీన వర్గాలకు చెందిన విద్యార్థి పిల్లలకు మధ్యాహ్న భోజనం పథకాన్ని అన్ని పాఠశాలల్లో అమలు చేస్తున్నారు. నారాయణ పేట జిల్లా మాగనూరులో ఫుడ్ ఫైజన్ జరిగిన సంఘటను రాష్ట్ర కేంద్రం నుండి పరిశీలించ డానికి ఆ గ్రామానికి వెళ్లడం జరిగింది మేము పరిశీలించిన దాంట్లో ప్రభుత్వం సరఫరా చేసే బియ్యంలో పాటి ఫైడ్ అనే రకం బియ్యంను కలిపి వస్తుండడంతో అందులో పురుగులు కూడా తొందరగా పడుతున్నాయి. పోషిక ఆహారమని ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికులకు ఇచ్చి బియ్యం వండిస్తున్నారు.పాటి ఫైడ్ బియ్యం నీళ్లల్లో పోస్తే పైకి తేలుతున్నాయి. ఈ యొక్క బియ్యం తొందరగా ఉడకవు ప్రభుత్వం ఇచ్చే రేషన్ బియ్యం తొందరగా ఉడుకు తవి కాబట్టి పాటి ఫైడ్ బియ్యం ఉడకకుండా పలుకుగా ఉండడంతో పిల్లలకు జీర్ణం కాకుండా కడుపు ఉబ్బడం వాంతులు కావడంతో పిల్లలు ఆరోగ్యాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు గుర్తించి పాటి ఫైడ్ బియ్యాన్ని వండకుండా విద్యాశాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం చేస్తున్న పప్పిదాలకు మధ్యాహ్న భోజన కార్మికుల నిర్లక్ష్యమని బలి పశువులను చేస్తున్నారు. నారాయణపేట జిల్లా మాగనూరు మండలంలో మధ్యాహ్న భోజనము కార్మికులను 23 సంవత్సరాలుగా పని చేసిన కార్మికులను తొలగించడం జరిగింది. కార్మికుల ను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# హైదరాబాదులో ప్రారంభమైన స్టార్ కార్డియాక్ కనెక్ట్ 2024

**హైదరాబాద్, నవంబర్ 30(నమస్తే ఉదయం):**
చాలాకాలంనుంచి దక్షిణభారతదేశంలోని, మరీ ముఖ్యంగా హైదరాబాద్లోని గుండె వ్యాధి చికిత్సానిపుణులు ఎదురుచూస్తున్న ‘స్టార్ కార్డియాక్ కనెక్ట్ 2024’ హైదరాబాద్ లో పద్మశ్రీ డాక్టర్ గోపీచంద్ మన్నమ్గా రి సారథ్యంలో ఆరంభమైంది. ఇది రెండు రోజులపాటు జరిగే శిక్షణ, ఉన్నత జ్ఞానసముపార్జన వర్క్షాప్ శిబిరంగా నిపుణులు అభివర్ణిస్తున్నారు. కార్డియాక్ సర్జరీలో, మినిమల్లీ ఇన్వేసివ్ కార్డియాక్ సర్జరీ (మిక్స్) లోనూ, రోబోటిక్ కార్డియాక్ సర్జరీ విధానాలలోనూ ఇటీవలి కాలంలో వచ్చిన అధునాతన సాంకేతిక నైపుణ్యం గురించిన పరిచయం, అవసరమైనచోట్ల ఆయా పరికరాలతో కూడిన శిక్షణలకు ఈ వర్క్షాప్ ఉపయోగపడుతుంది. ఈ వర్క్షాప్ నకు సుమారు వందకు మించిన సంఖ్యలో గుండె వ్యాధి చికిత్సానిపుణులైన డాక్టర్లు హాజరవుతున్నారని ఈ శిబిరాన్ని నిర్వహాకులైన స్టార్ హాస్పిటల్స్ వారు తెలియజేశారు. ఈ సర్జన్లకు ఆయా అంశాలలో తగు అవగాహన కలిగించటానికీ, మెరుగైన శిక్షణను అందించటానికి, ఆయా శస్త్రచికిత్స విధానాలలో చేరువగా ఉండి నైపుణ్యాన్ని అందజేయటానికీ టర్కీ, కెనడా, అమెరికా వంటి దేశాల అంతర్జాతీయ శస్త్ర వైద్యనిపుణులు ఈ శిబిరానికి విచ్చేశారు. ఈ శిబిరాల సమయంలో శస్త్రవైద్య నిపుణులకు ‘డ విన్సి సర్జికల్ రోబోటిక్ సిస్టమ్ పై పనిచేయగల అవకాశాలూ ఉంటాయనేది విశేషం.

ఈ ‘స్టార్ కార్డియాక్ కనెక్ట్ 2024’ వర్క్ షాప్ నకు పద్మశ్రీ డా. గోపీచంద్ మన్నంతోబాటుగా, ఎల్.వి. ప్రసాద్ ఐ హాస్పిటల్ స్థాపకులు డా. గుళ్లపల్లి ఎన్. రావ్, టర్కీ దేశంలోని ఇస్తాంబుల్లోని అసిబెదెమ్ విశ్వవిద్యాలయంలో కార్డియోథొరాసిక్ సర్జరీ ప్రొఫెసర్ డా. సెమ్ అల్హాన్ నిన్న శుభారంభం చేశారు. తమ ప్రారంభోపన్యాసంలో డాక్టర్ గోపీచంద్, ఇలాంటి వర్క్ షాపులు, అధునాతన వైద్యవిధానాలను కొత్తతరం వైద్యులకు పరిచయం చేస్తాయనీ, అంతర్జాతీయంగా శస్త్రచికిత్స విధానాలలో వస్తున్న మార్పులపట్ల అవగాహనను పెంచుతాయనీ వివరించారు. ఈ శిబిరాలకు హాజరైనవారు ఇక్కడ నేర్చుకునే అనేక నూతన వైద్యవిధానాలవల్ల రోగులకు మరింత మేలు జరుగుతుందనీ ఆశాభావం వ్యక్తం చేశారు.

డాక్టర్ గుళ్లపల్లి ఎన్. రావ్ మాట్లాడుతూ... వైద్యులు అందరూ




జ్యోతి ప్రజ్వలన చేసే స్టార్ కార్డియాక్ కనెక్ట్ 2024’ ను ప్రారంభిస్తున్న వైద్య నిపుణులు

తప్పనిసరిగా ‘3 హెచ్’లను గుర్తుంచుకోవాలని సూచించారు. వైద్యులు - తమ తలకాయలను (హెడ్), చేతులను (హ్యాండ్స్) జాగ్రత్తగా అదుపులో ఉంచుకోవాలనీ, తమవద్దకు వచ్చిన రోగులపట్ల మంచి మనసుతో (హార్ట్), సహానుభూతితో చూసుకోవాలనీ సలహా ఇచ్చారు. తోటి డాక్టర్ల నైపుణ్యం పెంపొందించటానికి ఇలాంటి శిబిరాలను తమ ఉత్తమ సేవాదృక్పథంతో చేపడుతున్న స్టార్ హాస్పిటల్స్ వారిని డా, రావ్, మనసారా అభినందించారు.

గుండె వైద్యరంగంలో తమ అనుభవాలను గురించి, డా. సెమ్ అల్హాన్ వివరంగా తెలియజేశారు. తమ ఇస్తాంబుల్లో మొత్తం 2009 నుంచి 2024 జూన్ వరకూ 3,460 గుండె శస్త్రచికిత్సలలోనూ 614 రోబోటిక్ కార్డియాక్ సర్జరీలు చేశామనీ, 221 ‘మినిమల్లీ ఇన్వేసివ్ కార్డియాక్ సర్జరీ’ (మిక్స్ సర్జరీలు) చేశామనీ తెలియజేశారు. 113 రోబోటిక్ అసిస్టెడ్ మిని సిఏబిజి శస్త్రచికిత్సలలో- శస్త్రచికిత్సల అనంతరం మరణాలు కానీ, పక్షవాతం వచ్చిన దాఖలాలు కానీ ఏమీ లేవని వారు ఆనందాన్ని వ్యక్తం చేశారు.

స్టార్ హాస్పిటల్స్ గ్రూప్ సీఈఓ డా. రాహుల్ మెడక్కర్, తమ స్టార్ హాస్పిటల్స్లో సంక్లిష్టమైన గుండె శస్త్రచికిత్సలలో 99 శాతం సఫలవంతం అవటం ఆనందదాయకమనీ, కొత్తతరం వైద్యులకు శిక్షణను, మార్గదర్శకత్వాన్నీ అందించటంకోసం ఇలాంటి శిబిరాలు, వర్క్షాపుల నిర్వహణలను స్టార్ హాస్పిటల్స్ వారు చేపడుతున్నారనీ వివరించారు.

# మల్కాజిగిరి నియోజకవర్గం పౌరుల ప్రయాణ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

**- మల్కాజిగిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి**

**మల్కాజి గిరి, నవంబర్ 30 (నమస్తే ఉదయం):**
మల్లాజిగిరి నియోజకవర్గంలోని వాజ్‌పెయి నగర్ వద్ద రైల్వే క్రాసింగ్ కారణంగా స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి సీరియస్ గా స్పందించారు. ఈ సమస్యపై ఆయన రోడ్లు, భవనాల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ పి.మధుసూదనరెడ్డికీ వినతిపత్రం అందజేశారు.

ప్రస్తుతం వాజ్ పయి నగర్ వద్ద రైల్వే గేటు తరచుగా ఎక్కువసేపు మూసివేయ బడటం వల్ల ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణికులు, ఉద్యోగులు , విద్యార్థులు ప్రతిరోజూ ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. రైళ్లు నిత్యం సర్వీస్‌లో ఉండడం వల్ల రోడ్డు ప్రయాణం పూర్తిగా నిలిచిపోతున్నదని,

ప్రజలు వారి సమస్యల పై తనకు అనేక వినతి పత్రాలను ఇస్తున్న కారణంగా ప్రతిపాదిత రైల్వే అండర్ బ్రిడ్జి (RUB) నిర్మాణాన్ని త్వరగా పూర్తిచేసేందుకు కృషి చేయాలని అధికారులను కోరారు. ఈ ప్రాజెక్టు మల్లాజిగిరి పౌరులకు రద్దీ సమస్యలను తగ్గించడమే కాకుండా, ప్రతిరోజూ వారి ప్రయాణాన్ని సులభతరం చేస్తుందని అభిప్రాయపడ్డారు. మౌలిక వసతుల ప్రాజెక్టుల పూర్తి కోసం తక్షణ చర్యలు తీసుకోవాలని R&B అధికారులను కోరుతూ, ప్రజల ప్రయాణ సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ RUB ప్రాజెక్టు సకాలంలో పూర్తి చేస్తే,



వాజ్‌పయి నగర్ పరిసర ప్రాంతాల ప్రజల దైనందిన సమస్యలు తీర్చాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి కోరారు. ఎమ్మెల్యే తో పాటు మాజీ యం. బి. సి. కార్పొరేషన్ చైర్మన్ నందికంటి శ్రీధర్, సీనియర్ నాయకులు బద్దం పరశురామ్ రెడ్డి, మేకల రాము యాదవ్ తదితరులు ఉన్నారు.

రోడ్లు భవనాలు శాఖ ఈఎంసి మధుసూదన్ రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

# మెట్రో ప్రయాణికులకు భారీ శుభవార్త

**శీతాకాలంలో మెట్రోకు పెరిగిన ఆదరణ..**

**నేటిటి నుంచే మూడు నెలల కాలానికి ఆఫర్లు**

**హైదరాబాద్, నవంబర్ 30(నమస్తే ఉదయం):**
హైదరాబాద్‌లో మెట్రో రైలు సేవలు అందుబాటులోకి వచ్చిన తర్వాత ప్రజల ప్రయాణ విధానాల్లో గణనీయమైన మార్పు వచ్చింది. ట్రాఫిక్‌కి అంతరాయం లేకుండా, వేగవంతమైన రవాణా అందించాలనే లక్ష్యంతో ఎల్ అండ్ టీ సంస్థ ఈ మెట్రో ప్రాజెక్టును ప్రారంభించింది. మొదటి నుంచే మెట్రో రైలు సేవలకు ప్రజల నుంచి విశేష ఆదరణ లభించింది. అయితే, మెట్రో ప్రయాణీకుల సంఖ్య పెరుగుతున్నా, హైదరాబాద్ ట్రాఫిక్ సమస్య మాత్రం తగ్గడం లేదు. ఆఫీసులకు వెళ్లే వారు శీతాకాలంలో రోడ్డు ట్రాఫిక్ సమస్యలను తగ్గించుకోవడంలో మెట్రోను ఆశ్రయిస్తున్నారు. మెట్రోలో ప్రయాణం తక్కువ ఖర్చుతో పాటు ట్రాఫిక్ సమస్య నుంచి ఉపశమనం అందించడంలో ముఖ్య పాత్ర పోషిస్తోంది. ఈ నేపథ్యంలో, రెగ్యులర్ మెట్రో ప్రయాణికులను మరింత ప్రోత్సహించేందుకు ఎల్ అండ్ టీ మెట్రో ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించింది. డిసెంబర్ 1 నుండి ఫిబ్రవరి 28 వరకు, మూడు నెలల కాలానికి ప్రయాణాలను ఆధారంగా తీసుకొని ప్రయాణికులకు ప్లాటినం, గోల్డ్, సిల్వర్ బ్యాండ్లు అందించనున్నట్లు అధికారులు ప్రకటించారు. 51 ట్రిప్పుల కన్నా ఎక్కువగా ప్రయాణించిన వారికి ప్లాటినం బ్యాండ్ అందజేస్తారు. 36-50 ట్రిప్పుల మధ్య ప్రయాణిస్తే గోల్డ్ బ్యాండ్ ఇస్తారు. 21-35 ట్రిప్పుల ప్రయాణానికి సిల్వర్ బ్యాండ్ ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమం ద్వారా మెట్రో ప్రయాణాన్ని ప్రజల రోజువారీ జీవితంలో భాగం చేయడమే ఎల్ అండ్ టీ సంస్థ ముఖ్య ఉద్దేశ్యం. మెట్రో సేవల వినియోగం పెరిగితే, రోడ్లపై ట్రాఫిక్ సమస్య



తగ్గుతుందని అధికారులు భావిస్తున్నారు. మెట్రో సేవలు వేగం, సౌకర్యం, విశ్వసనీయతలో ముందంజలో ఉంటూ, హైదరాబాద్ నగరాన్ని కొత్త గమ్యానికి తీసుకెళ్తున్నాయి. ఆఫర్ నేటి నుంచే అమల్లోకి రానుంది.

# రైతుబంధును శాశ్వతంగా బంద్ పెట్టే కుట్ర

**బీఆర్ఎస్ పాలనలో రైతులు కళకళలాడారు**

**ఐక్యరాజ్యసమితి మెచ్చుకున్న పార్టీ బీఆర్ఎస్**

**కేసీఆర్ సంక్షేమాలు ప్రజలు ఎన్నటికీ మరిచిపోరు : మాజీ మంత్రి హరీశ్‌రావు**

**హైదరాబాద్, నవంబర్ 30 (నమస్తే ఉదయం):**
ఆనాడు కేసీఆర్ అందించిన సంక్షేమ పథకాలపై ఐక్యరాజ్య సమితిసాగుకు పెట్టుబడి సాయం అందించి రైతన్నకు భరోసా కల్పించిన రైతుబంధు పథకాన్ని శాశ్వతంగా బంద్ పెట్టే కుట్రకు కాంగ్రెస్ ప్రభుత్వం తెర లేపడం సిగ్గుచేటని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావుఅన్నారు. రైతుబంధు కంటే సన్నాలకిచ్చే రూ.500 బోనసే మేలని రైతులు చెబుతున్నట్టు వ్యవసాయ శాఖ మంత్రి చెప్పడం శోచనీయమన్నారు. ప్రపంచంలో రైతుకు పెట్టుబడి సాయం అందించిన ఏకైక పథకం రైతుబంధు అని ఐక్యరాజ్య సమితి సైతం ప్రశంసించిందని గుర్తుచేశారు. అలాంటి గొప్ప పథకాన్ని ఒక ప్రణాళిక ప్రకారం రూపుమాపే ప్రయత్నం చేస్తుండడం దుర్మార్గమని విమర్శించారు. రాష్ట్రంలో 1.53 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తే 5,19,605 క్వింటాళ్ల సన్న వడ్లను క్వింటాలుకు రూ.500 బోనస్ ఇచ్చి కొనుగోలు చేసినట్లు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఈ లెక్కన రైతులకు దక్కిన బోనస్ సుమారు రూ.26 కోట్లు మాత్రమేనని చెప్పారు. అదే రైతుబంధు కింద ఏడాదికి రూ.7500 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేయాల్సి ఉంటుందని వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో చెప్పినట్లు ఎకరాకు రూ.15 వేలు చెల్లిస్తే ఇది ఇంకా ఎక్కువ అవుతుందని తెలిపారు. మరి రైతు బంధు కంటే, బోనస్ అందించడం రైతులకు మేలు ఎట్లవుతుందో వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి రాగానే రుణమాఫీ సగం మందికి చేసి, సగం మందికి మొండి చేయి చూపారని విమర్శించారు. ఆ తర్వాత అన్ని పంటలకు బోనస్ అని, చివరకు సన్నాళ్లకు మాత్రమే పరిమితం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పుడు రైతుబంధును శాశ్వతంగా రద్దు చేసే ప్రయత్నం మొదలుపెట్టారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతుబంధును బందు చేస్తారని



కేసీఆర్ ముందే హెచ్చరించారని గుర్తుచేశారు. అనుకున్నట్టే రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేస్తున్నదని చెప్పారు. రైతు భరోసా వస్తదని ఎదురుచూస్తున్న రైతులు, కౌలు రైతులు, ఉపాధి కూలీలు మోసపోయినట్లేనా అని ప్రశ్నించారు. రైతులను విజయవంతంగా మోసం చేసినందుకు రైతు పండుగ నిర్వహిస్తున్నావా రేవంత్ రెడ్డి అని నిలదీశారు. మేనిఫెస్టోలో చెప్పి, రైతులను నమ్మించి అధికారంలోకి వచ్చాకదగా చేసినందుకు విజయోత్సవాలా రేవంత్ రెడ్డి అని దుయ్యబట్టారు. రైతుల బతుకులు మార్చేందుకు కేసీఆర్ తీసుకొచ్చిన రైతు బంధు పథకాన్ని నిలిపివేసే కుట్రను బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నదని చెప్పారు.



# వీణారావ్ ఫస్ట్ దర్శన్

తెలుగు చిత్రసీమలో విశిష్టమైన నందమూరి వారసత్వాన్ని మరింత ముందుకు తీసుకువెళుతూ, లెజెండరీ శ్రీ ఎన్టీఆర్ ముని మనవడు, హరికృష్ణ మనవడు, దివంగత శ్రీ జానకిరామ్ తనయుడు యంగ్ చాప్ నందమూరి తారక రామారావు ఫిలిమ్స్ లోకి గ్రాండ్ ఎంట్రీ ఇస్తున్నారు. డైనమిక్ డైరెక్టర్ వైవిఎస్ చౌదరి రచన, దర్శకత్వం వహిస్తున్న ఈ ఎక్సయిటింగ్ ప్రాజెక్ట్ ని "న్యూ టాలెంట్ రోర్స్ ఏ" బ్యానర్‌పై యలమంచిలి గీత నిర్మించనున్నారు. ఇప్పటికే లాంచ్ చేసిన నందమూరి తారక రామారావు ఫస్ట్ దర్శన్ కి వరల్డ్ వైడ్ ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది.

ఈ చిత్రం ద్వారా ప్రతిభావంతులైన కూచిపూడి డ్యాన్సర్, తెలుగు అమ్మాయి వీణారావు కథానాయికగా పరిచయం అవుతున్నారు. వీణారావు ఫస్ట్ దర్శన్‌ని నిర్మాతలు సుప్రియ యార్లగడ్డ, స్వప్న దత్ లాంచ్ చేశారు. అచ్చతెలుగు అందాలరాశి వీణారావు ఫస్ట్ దర్శన్ అందరినీ మెస్మరైజ్ చేసింది. ఫస్ట్ దర్శన్ షో రీల్ లో ట్రెడిషనల్, మోడ్రన్ అవుట్ ఫిట్స్ లో వీణారావు డిఫరెంట్ బ్యూటీఫుల్ లుక్స్ విశేషంగా ఆకట్టుకున్నాయి.



# పవన్‌కి న్యూయర్ స్టార్టింగ్‌లోనే ఎండ్ కార్డా?

పవర్‌స్టార్ పవన్‌కళ్యాణ్ రాజకీయాల్లో చురుగ్గా ఉంటూనే ఓ పక్క సినిమాలను కూడా అంతే చురుగ్గా చేస్తున్నారు. ప్రస్తుతం హరిహర వీరమల్లు ఓజీ సినిమాలు ఆన్ సెట్స్‌లో ఉన్న సంగతి తెలిసిందే. రెండు చిత్రాల షూటింగ్ కూడా ముగింపు దశలోనే ఉన్నాయి. పవన్ కళ్యాణ్ కి సమయం దొరికి సవ్యంగా డేట్లు కేటాయించి ఉంటే? ఇప్పటికే వాటి షూటింగ్ కూడా పూర్తయ్యేది. కానీ రాజకీయం-సినిమా అనే రెండు పడవల ప్రయాణ నేపథ్యంలో ఎంత వేగంగా పూర్తి చేయాలి? అన్న సాధ్యపడటం లేదు. జనవరి ముగింపుకు రెండు సినిమా షూటింగ్ పూర్తవుతుందని సమాచారం. పవన్ కళ్యాణ్ పోర్షన్ మొత్తం పూర్తవుతుందన్నది తాజా అప్ డేట్. హరిహర వీరమల్లుకు సంబంధించి పవన్ నాలుగు నుంచి ఐదు రోజులు గ్యాప్ లేకుండా డేట్లు ఇస్తే చాలా ముగించడానికి రెడీగా ఉంది టీమ్. అందుకు తగ్గట్టు పవన్ డేట్లు ఇచ్చినట్లు తెలుస్తోంది. దీంతో పవన్ పోర్షన్ పూర్తవుతుంది.

ఇక ఓజీ సినిమా కోసం 15 రోజులు కేటాయిస్తే చాలు ముగించడానికి సుజిత్ రెడీగా ఉన్నాడు. అందుకు తగ్గట్టే పవన్ డేట్లు కేటాయించినట్లు సమాచారం. జనవరి నుంచి పవన్ ఓజీ షూటింగ్ లో పాల్గొంటారని సమాచారం. దీంతో ఓజీకి సంబంధించి పవన్ పోర్షన్ మొత్తం కంప్లీట్ అవుతుంది. అంటే జనవరి చివరికల్లా వీరమల్లు..ఓజీ ల పవన్ పోర్షన్ మేకర్స్ పూర్తి చేయనున్నారు.



## 'స్టైల్ ఐకాన్ ఆఫ్ ది ఇయర్'గా నభా నటేష్

బ్యూటిఫుల్ టాలెంటెడ్ హీరోయిన్ నభా నటేష్ మరో అరుదైన గౌరవాన్ని దక్కించుకున్నారు. 'స్టైల్ ఐకాన్ ఆఫ్ ది ఇయర్' గా ఔట్ లుక్ అవార్డ్ గెల్చుకున్నారు. స్టార్ హీరోయిన్ కీర్తి సురేష్ చేతుల మీదుగా నభా ఈ అవార్డ్ స్వీకరించారు. గ్లామర్ తో పాటు పర్ ఫార్మెన్స్ తో మెప్పించగల హీరోయిన్ గా పేరున్న నభా నటేష్ కు ఈ అవార్డ్ వెల్ డిసర్వడ్ అని అనుకోవచ్చు. స్టైల్ ఐకాన్ ఆఫ్ ది ఇయర్ గా ఔట్ లుక్ అవార్డ్ గెల్చుకున్న నభా నటేష్ ఫొటోస్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. నభా లేటేస్ట్ గా తెలుగులో బ్యాక్ టు బ్యాక్ పాన్ ఇండియా మూవీస్ చేస్తోంది. నిఖిల్ హీరోగా నటిస్తున్న స్వయంభు మూవీలో నభా నటేష్ హీరోయిన్ గా నటిస్తోంది. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ లో ఉంది. అలాగే రీసెంట్ గా నాగబంధం అనే పాన్ ఇండియా మూవీని స్టార్ట్ చేసింది. ఈ రెండు చిత్రాలతో నభా నటేష్ మరోసారి అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. మరికొన్ని ఇంట్రెస్టింగ్ ప్రాజెక్ట్స్ ఆమె ఖాతాలో ఉన్నాయి.



# తెలుగులో 'పా.. పా..'గా తమిళ లో'డా..డా'

తెలుగు తెరపైకి ఓ ఫీల్ గుడ్ ఎమోషనల్ డ్రామా రాబోతోంది. తమిళ సెన్సేషనల్ బ్లాక్ బస్టర్ 'డా..డా' మూవీ తెలుగులో 'పా.. పా..' టైటిల్‌తో జెకె ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌పై, నిర్మాత నీరజ కోట విడుదల చేయబోతున్నారు. డిసెంబర్ 13న ఈ చిత్రాన్నిఆంధ్ర, తెలంగాణతో పాటు అమెరికా, ఆస్ట్రేలియా థియేటర్‌లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. గత ఏడాది తమిళంలో 'డా..డా' మూవీ సెన్సేషనల్ హిట్ సాధించింది. కవిన్, అపర్ణ దాస్ ప్రధాన పాత్రదారులుగా, డైరెక్టర్ గణేష్ కె బాబు తెరకెక్కించిన 'డా..డా' చిత్రం తమిళ ఆడియన్స్‌ని విపరీతంగా ఆకట్టుకుంది. కోలీవుడ్ ఇండస్ట్రీలో డిస్ట్రిబ్యూటర్‌లకు కాసుల వర్షం కురిపించింది. అతి తక్కువ బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ సినిమా సుమారు 30 కోట్లు వసూళు సాధించి బ్లాక్ బస్టర్ విజయాన్ని నమోదు చేసుకుంది.

## సెన్సేషనల్ కాన్సెప్టుతో రాబోతున్న 'M4M'

మూవీ మేకర్ మోహన్ వడ్లపట్ల దర్శకుడిగా, జో శర్మ (యూఎస్‌ఏ) హీరోయిన్‌గా తెరకెక్కిన పాన్ ఇండియా మూవీ 'ఎంఫోర్‌ఎం' (M4వీ – Motive For Murder) విడుదలకు ముస్తాబవుతోంది. ఈ సందర్భంగా డైరెక్టర్ మోహన్ వడ్లపట్ల సినిమా హైలైట్స్ చెప్పారు. వరల్డ్‌వైడ్‌గా అందరికి కనెక్ట్ అయ్యే సబ్జెక్టుతో తెరకెక్కించామని చెప్పారు. 110 ఏళ్ల సినీ చరిత్రలో



ఇంతవరకు ఎవరూ తీసుకోని కాన్సెప్టుతో ఈ సినిమా చేసినట్టు తెలిపారు. రాబోయే పదేళ్లు ఈ సినిమా గురించే మాట్లాడు కుంటారనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా డైరెక్టర్ మోహన్ వడ్లపట్ల మాట్లాడుతూ.. "ఇటీవల 'ఎంఫోర్‌ఎం' మూవీ హిందీ ట్రైలర్ ప్రతిష్టాత్మక గోవా ఫిలిం ఫెస్టివల్‌లో ఇండియన్ మోషన్ పిక్చర్స్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ (IMPPA) ఆధ్వర్యంలో విడుదల చేయడంతో సినిమాకు మంచి రెస్పాన్స్ వచ్చిందని, అంచనాలు భారీగా పెరిగాయన్నారు. ఎక్సలెంట్ టీంతో సినిమాను ఎంతో అద్భుతంగా పూర్తి చేశామన్నారు. హీరోయిన్ జో శర్మ తన ఫర్మార్మెన్స్‌తో సినిమాకు హైలైట్‌గా మారిందని డైరెక్టర్ మోహన్ వడ్లపట్ల తెలిపారు. హాలీవుడ్ రేంజ్‌లో తెరకెక్కించామని, కథ, కథనాలను నమ్ముకునే సినిమాను తీశానని చెప్పారు.

## సీతక్క చేతుల మీదుగా 'నారి' టైటిల్ పోస్టర్

ఆమని, వికాస్ వశిష్ఠ,మౌనిక రెడ్డి, ప్రగతి, కేదార్ శంకర్, ప్రమోదినీ తదితరులు కీలక పాత్రల్లో నటించిన సినిమా నారి. మహిళల్ని గౌరవించాలి, ఆడిపిల్లలు అన్ని రంగాల్లో ఎదిగేందుకు సహకరించాలి అనే కాన్సెప్ట్ తో దర్శకుడు సూర్య వంటిపల్లి ఈ చిత్రాన్ని రూపొందించారు. ప్రొడ్యూసర్ శ్రీమతి శశి వంటిపల్లి నిర్మించారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న నారి సినిమా డిసెంబర్ 25న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. తాజాగా స్త్రీ, శిశు సంక్షేమ శాఖా మంత్రి సీతక్క ఈ సినిమా టైటిల్ పోస్టర్, గ్లింప్స్ రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ – మహిళలు ఎన్నో రంగాల్లో ఎదుగుతున్నారు. అయినా వారి పట్ల వివక్ష, చిన్నచూపు తగ్గడం లేదు. సమాజ నిర్మాతలు



మహిళల అనే నిజాన్ని మనమంతా గుర్తుపెట్టుకోవాలి. ఆడ పిల్లలు ఎదిగేందుకు ప్రతి ఒక్కరు తోడ్పాటు అందించాలి. మహిళల్ని గౌరవించాలి. ఇలాంటి గొప్ప కాన్సెప్ట్ తో నారి సినిమా చేసిన సూర్య వంటిపల్లికి అభినందనలు అన్నారు.

## రామ్ చరణ్16లో మున్నాభాయ్ 'దివ్వేందు'

ట్రిపుల్ ఆర్‌తో గ్లోబల్ సక్సెస్‌ను సాధించి ప్రపంచ వ్యాప్తంగా అభిమానులను, సినీ ప్రేక్షకులను మెప్పించిన గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ ఇప్పుడు తన రామ్‌చరణ్16 సినిమా షూటింగ్‌ను ప్రారంభించిన సంగతి తెలిసిందే. రీసెంట్‌గానే ఈ సినిమా షూటింగ్‌ను మైసూర్‌లో ప్రారంభించారు. తొలి చిత్రం ఉప్పెనతో బ్లాక్ బస్టర్ సాధించి అందరి దృష్టిని ఆకర్షించిన దర్శకుడు బుచ్చిబాబు సానా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్స్ సమర్పణలో ఈ భారీ పాన్ ఇండియా సినిమాను వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. అనౌన్స్‌మెంట్ రోజు నుంచి అంచనాలు పెంచుతూ వస్తోన్న ఈ సినిమాను భారీ స్థాయిలో హై టెక్నికల్ వేల్యూస్‌తో అన్‌కాంప్రమైజ్డ్‌గా రూపొందిస్తున్నారు మేకర్స్. పాన్ ఇండియా సినిమాలోకి భారీ తారాగణం కూడా నటిస్తున్నారు. కరుణడ చక్రవర్తి శివరాజ్‌కుమార్ ఈ చిత్రంతో తెలుగు సినిమాల్లోకి ఎంట్రీ ఇస్తున్నారు. ఆయన చాలా పవర్‌ఫుల్ పాత్రలో మెప్పించబోతున్నారు. తాజాగా ఇప్పుడు బాలీవుడ్ యంగ్ సెన్సేషన్ దివ్వేందు ఇందులో కీలక పాత్రలో అలరించబోతున్నారు.



**Printed and Published MEKALA DAMODAR REDDY** on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy,Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.Damodhar Reddy. "RNI. Title- Code: TELTEL/2023/87699.** Cell: 9492148733